క్లుప్తంగా

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా స్వామి



జహీరాబాద్: జహీరాబాద్ ఆర్టీసీ బస్‌డిపో మేనేజర్‌గా టి.స్వామి నియమితులయ్యారు. ఇప్పటివరకు డిపో మేనేజర్‌గా పని చేసిన జాకీర్ హుసేన్ జోనల్ వర్క్‌షాప్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వచ్చిన స్వామి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డీపో మేనేజర్‌కు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. బదిలీపై వెళ్తున్న జాకీర్ హుసేన్‌ను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

డ్రైనేజీ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న శుక్లవర్ధన్‌రెడ్డి

జహీరాబాద్: పట్టణంలోని మంగాపురం కాలనీలో డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. మంగళవారం ఎంపీ కార్యాలయం ఇన్‌చార్జి జి.శుక్లవర్ధన్‌రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎంపీ సురేష్‌షెట్కార్ ప్రత్యేక చొరవతో మున్సిపల్ నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎంపీకి కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

గణేష్‌గడ్డ దేవస్థానంలో భక్తుల కిటకిట



క్యూలైన్‌లో వేచియున్న భక్తులు

పటాన్‌చెరు టౌన్: గణేష్‌గడ్డ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం అమావాస్య సందర్భంగా పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని గణేష్ గడ్డ దేవస్థానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృత అభిషేకం, హోమం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ మాట్లాడుతూ.. స్వామివారి దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశామన్నారు. ఆలయంలో నిత్యఅన్నదానం కొనసాగుతుందని తెలిపారు.

శబ్ద కాలుష్యంపై ఫిర్యాదు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ వీధుల్లో నిత్యం పెద్ద ఎత్తున వస్తున్న శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలని స్థానిక నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగర పరిధిలోని ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలన్నారు. వీధుల్లో పెద్ద ఎత్తున యువకులు ద్విచక్ర వాహనాలపై రాత్రింబవళ్లు కాలుష్యాన్ని సృష్టిస్తున్నారని వాపోయారు. శబ్దాలకు కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తల్లులకు సన్మానం



తల్లులను సన్మానిస్తున్న సభ్యులు

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం నస్తీపూర్‌లో ఆడపిల్లల తల్లులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ఐదు మంది ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లులకు గ్రామంలోని మహిళా సమైక్య భవనంలో మహిళా సంఘం సభ్యులు కొత్త బట్టలు ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో మహిళా సమైక్య సంఘం అధ్యక్షురాలు స్వప్న , కార్యదర్శి అక్షయ, సీసీ కల్పన, వీఓఏ ప్రవీణ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రచారజాత ప్రారంభం



ప్రచారజాతను ప్రారంభిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: బడిబాట నమోదు ప్రచారజాతను ఖేడ్ నుంచి టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కంబపురం అశోక్ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన, ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, రాగిజావ అందించనున్నట్లు తెలిపారు. విశాల తరగతి గదులు, కంప్యూటర్ విద్య ఉన్నాయని అన్నారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. ఆయా మండలాల ఎంఈఓలు మన్మథ కిషోర్, రాజశేఖర్, విశ్వనాథ్‌లు మాట్లాడుతూ.. సంఘం ఉపాధ్యాయులు హక్కుల కోసం మాత్రమే పనిచేయకుండా సామాజిక స్పృహతో బడిపిల్లల నమోదు జాతను నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

నిబంధనలకు విరుద్ధంగా హత్నూర మండలం సికిందలాపూర్ గ్రామశివారు కుంటలో మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. దీంతో కుంట సమీపంలోని పంట పొలాలు, ఆయాగ్రామాల్లోని రోడ్డులు ధ్వంసమవుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. సహజ వనరులను రక్షించాల్సిన అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

- నిబంధనలకు తిలోదకాలు
- రాత్రి పగలు తేడా లేకుండా రవాణా



మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

హత్నూర (సంగారెడ్డి): జిల్లా అధికారుల నుంచి వ్యాపారులు నల్లమట్టి తవ్వకాలకు అనుమతులు తీసుకున్నారు. కానీ, నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలను సైతం పట్టించుకోకుండా పగలు రాత్రి తేడా లేకుండా తవ్వకాలు చేస్తూ టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఈ సంఘటన హత్నూర మండలం సికిందలాపూర్ గ్రామ శివారులోని ఇతయ్య (మక్త) కుంటా సర్వే నంబర్ 198లో నల్లమట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామస్తులు విన్నపం మేరకు జిల్లా కలెక్టర్ నుంచి తవ్వకాలకు అనుమతి పొందారు. రెండు ఎకరాల 37 గుంటల భూమిలో తవ్వకాలు జరిపేందుకు జిల్లా నీటిపారుదల శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు. జూన్ 25 వరకు ఈ అనుమతులు ఉన్నాయి. ఒకటి , 20 మీటర్ల లోతు తీయాల్సి ఉండగా ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా లోతు తీస్తే చర్యలు తీసుకుంటామని అనుమతులు ఇచ్చిన కాపీలో ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా తవ్వకాలు చేపడుతున్నారు. పగలు మాత్రమే రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారుల పర్యవేక్షణలోనే తవ్వకాలు చేసి రవాణా చేయాల్సి ఉన్నప్పటికీ నిబంధనలు పట్టించుకోకుండా రాత్రి, పగలు తవ్వకాలు చేస్తూ రవాణా చేస్తున్నారు. అధిక లోడుతో టిప్పర్లు వెళ్లడం వల్ల రోడ్లు ధ్వంసమవుతున్నాయని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిబంధనల ప్రకారం తవ్వకాలు జరపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

నిబంధనలను అతిక్రమించి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకే తవ్వకాలు చేపట్టి నల్లమట్టి రవాణా చేయాలి. రాత్రి వేళలో నల్లమట్టి తవ్వకాలు, రవాణా చేపడితే చర్యలు తీసుకుంటాం.

– ఐబీఏఈఈ వందన

నీటి సమస్య పరిష్కరించాలని నిరసన



ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న తండావాసులు

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని సజ్జారావుపేటతండాలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని తండావాసులు కోరారు. మంగళవారం తండాలోని ప్రధాన రహదారిపై మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన వ్యక్తం చేశారు. ఆరునెలలుగా తండాలో నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా .. పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించకపోవడంతో దుర్వాసన భరించలేక పోతున్నామని వాపోయారు. ఈ విషయమై స్పెషలాఫీసర్, ఎంపీడీఓలకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నిధులు లేవని సమాధానం చెబుతూ దాటవేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని తండావాసులు కోరుతున్నారు.

దశలవారీగా గ్రామాల అభివృద్ధి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సౌజన్య తదితరులు

ఎంపీడీఓ సౌజన్య

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీడీఓ సౌజన్య అన్నారు. మంగళవారం మండలంలోని అత్నూర్‌లో రూ.15లక్షలుతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి పథకంతో పాటు ఇతర పథకాల కింద సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. చాలా గ్రామాల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వల సమస్య దూరమైందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గౌసోద్దీన్, మాజీ జెడ్పీటీసీ శివాజీ పాటిల్, మాజీ సర్పంచ్ సంగ్రాం పాటిల్, పంచాయతీ కార్యదర్శి శారీన్ తదితరులు పాల్గొన్నారు.

యువత దేశభక్తిని అలవర్చుకోవాలి



తిరంగా ర్యాలీలో పాల్గొన్న అంజిరెడ్డి, నాయకులు

ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): యువత తమ హృదయాల్లో దేశభక్తి నింపుకొని దేశ భద్రత కోసం కృషి చేయాలని బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. సైనికులకు సంఘీభావంగా మంగళవారం సదాశివపేట పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని శ్రీరామ మందిరం నుంచి ఎడ్లబజార్ బసవేశ్వర మందిరం వరకు ర్యాలీ సాగింది. అనంతరం బసవేశ్వర మందిరంలో మాజీ సైనికులు, పోలీస్ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు రాజేశ్వర్‌రావు, మునిపల్లి సత్యనారాయణ, కంది కృష్ణ, తుల్జరామ్, చింత సాయినాథ్ పాల్గొన్నారు.

సీఐటీయూ నేతల మాటలు నమ్మొద్దు



మాట్లాడుతున్న శంకరప్ప, నాయకులు

ఏఐటీయూసీ మండల కార్యదర్శి శంకరప్ప

సదాశివపేట(సంగారెడ్డి): బీఎంఎస్, సీఐటీయూ నాయకుల మాటలు నమ్మి ఎంఆర్‌ఎఫ్ కార్మికులు మోసపోవద్దని ఏఐటీయూసీ మండల కార్యదర్శి శంకరప్ప అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఎంఆర్‌ఎఫ్ కార్మికులకు మరో రెండు సంవత్సరాలు అగ్రిమెంట్ చేసే అవకాశం లేకున్న అగ్రిమెంట్, బోనస్ కల్పిస్తామని బీఎంఎస్, సీఐటీయూ నాయకులు కార్మికులకు తప్పుడు హామీలిస్తున్నారన్నారు. బుధవారం జరగనున్న ఎంఆర్‌ఎఫ్ కార్మిక ఎన్నికల్లో కేపీఎస్ యూనియన్‌కు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. కార్మికులందరూ ఆలోచించి కేపీఎస్ యూనియన్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, పాండు, సోంశెట్టి, శివరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి పోతిరెడ్డిపల్లి చౌరస్తా, సంగారెడ్డి పాత బస్టాండ్, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఇద్దరికి రూ.2000, మరో ఇద్దరికి రూ.1500, ముగ్గురికి రూ.1000 చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీస్‌లు పేర్కొన్నారు.

ఎనిమిది మందికి..

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం కోర్టులో హాజరు పర్చగా ఏడుగురికి రూ. వెయ్యి, ఒకరి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం



యోగా ఆసనాలు చేస్తున్న సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని డాక్టర్. రామమాత, డాక్టర్. కల్పన ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి యోగాపై అవగాహన కల్పించారు.

యోగాను అలవర్చుకోవాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రతి చిన్న రోగానికి మందులు వాడకుండా యోగా చేయడం అలవాటు చేసుకోవాలని న్యాల్‌కల్ పీహెచ్‌సీ ఆయుర్వేద వైద్యుడు గణపతిరావు పేర్కొన్నారు. మండలం పరిధి రత్నాపూర్‌లో మంగళవారం యోగా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధ్యమైనంత వరకు మందుల వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. నిత్యం యోగా చేయడం మంచిదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శాంత్‌కుమార్ పాటిల్, హెచ్‌ఎం బస్వరాజ్ ఈస్టర్ రవి, ఆశ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త విజయలక్ష్మి

జహీరాబాద్: పంటల మార్పిడితోనే సుస్థిర ఆదాయం సాధ్యమవుతోందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రంజోల్ రైతు వేదికలో వ్యవసాయశాఖ, ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో బసంత్‌పూర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త విజయలక్ష్మి, కంది వ్యవసాయ ఇంజనీరింగ్ శాస్త్రవేత్త రాజేందర్, మండల వ్యవసాయాధికారి లావణ్యలు మాట్లాడారు. పంట మార్పిడి వల్ల అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఒకే పంటను వేయడం వల్ల దిగుబడులు ఆశించిన మేర రావన్నారు. రైతులు యూరియాను తక్కువగా వాడి సాగు ఖర్చులను తగ్గించుకోవాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేసుకున్నప్పుడు తప్పనిసరిగా రశీదులను పొందాలని, వాటిని భద్రపర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రదీప్‌కుమార్, రైతులు సంజీవరెడ్డి, రాజు రెడ్డి, విజేందర్, ఫిరోజ్, మోహన్ రెడ్డి, బక్కన్న, చంద్రయ్య, రామ్మోహన్‌రావు, శేఖర్, రాంరెడ్డి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడండి



కబ్జాపై కలెక్టర్‌కు వివరిస్తున్న గ్రామపెద్దలు

పటాన్‌చెరు: ఆలయ భూములను కాపాడాలని అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి బీరంగూడ గ్రామ పెద్దలు మంగళవారం జిల్లా కలెక్టర్ క్రాంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీరంగూడ పరిధిలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయం అనుకొని ఉన్న సర్వే నంబర్ 993 దేవాలయ భూమికి డాక్యుమెంట్లు సృష్టించి ఫ్లాట్స్ చేసి విక్రయిస్తున్నారని, వందల కోట్ల కుంభకోణం చేస్తున్న పాండురంగారావు, వారి కుమారులుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్‌ను కలిసినవారిలో అదెల్లి రవీందర్, పెద్ద రమేష్ శ్రీనివాస్ సత్యనారాయణ మల్లేష్ శివ ప్రవీణ్ ఉన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు



కంది శివారులో చేతికందేలా కరెంట్ తీగలు

- వేలాడుతున్న విద్యుత్ తీగలు
- ఆందోళనలో అన్నదాతలు



తుంకిళ్ల తండా శివారులో ఒరిగిన స్తంభాలు

కంది(సంగారెడ్డి): ఒరిగిన విద్యుత్ స్తంభాలు.. చేతికి అందేలా వేలాడుతున్న తీగలు ప్రమాదకరంగా మారాయి. మండలంలో చాలా చోట్ల పంట పొలాల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుండగా, స్తంభాలు ఓవైపు ఒరిగి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని కందితండా, మామిడిపల్లి, వడ్డెనగూడ తండా, ఎర్థనూర్, కలివేముల, తుంకిళ్ల తండా, చెర్లగూడెం, కంది, మక్త అల్లూరు, కలివేముల తదితర గ్రామాల శివారుల్లో విద్యుత్ స్తంభాలు వల్ల పొలాల్లో వరికోత యంత్రాలు నడవని పరిస్థితి నెలకొంది. అలాగే, పొలాల్లో నుంచి గడ్డి మోపులను తీసుకెళ్లే సమయంలో తీగలు తగిలి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ ప్రకాశ్‌ను న్యూస్ లైన్ వివరణ కోరగా మండలంలో వంగిన స్తంభాలు, వదులుగా ఉన్న కరెంట్ తీగలపై సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే



స్వామివారిని దర్శించుకొని వస్తున్న మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గంలోని తాజా మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు స్వామి వారిని దర్శించుకున్నారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు

ఏడీఏ నూతన్‌కుమార్



దుకాణాలు తనిఖీ చేస్తున్న నూతన్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): విత్తనాలు అధిక ధరలకు అమ్మితే లైసెన్సులు రద్దు చేస్తామని ఏడీఏ నూతన్ కుమార్ డీలర్లను హెచ్చరించారు. మంగళవారం కంగ్టి, తడ్కల్ గ్రామాల్లోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాల తయారీ సంస్థ, తయారీ కాలం, బ్యాచ్ నంబర్, జెనెటిక్ ప్యూరిటీ నంబర్ తదితర అంశాలను పరిశీలించారు. కంగ్టి, తడ్కల్‌ల్లోని అన్నీ దుకాణాలు పరిశీలించినట్లు పేర్కొన్నారు.

నేల తడిస్తేనే విత్తనాలు నాటండి

భూమిలో 6 సె.మీ లోతు వరకు తేమ ఉంటేనే విత్తనాలు విత్తలని ఏడీఏ సూచించారు. తొందర పడి విత్తనాలు విత్తి రైతులు నష్టపోవద్దన్నారు. నకిలీ విత్తనాలు, లూజుగా విత్తనాలు కొనుగోలు చేయవద్దని తెలిపారు. బిల్లులు తీసుకొని పంట కాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ అందుబాటులో జనుము విత్తనాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలానికి 129.60 క్వింటాళ్ల జనుము విత్తనాలు వచ్చినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి అభినాష్‌వర్మ తెలిపారు. న్యాల్‌కల్ డీసీఎంఎస్‌కు 64.80 క్వింటాళ్లు, హద్నూర్ పీఏసీఎస్‌కు 64.80 క్వింటాళ్ల జనుము విత్తనాలు వచ్చాయన్నారు. బస్తా(40కిలోలు) ధర రూ.2,510లుగా నిర్ణయించామన్నారు. ఒక రైతుకు ఒక బస్తా మాత్రమే ఇవ్వనున్నట్లు చెప్పారు. బుధవారం నుంచి న్యాల్‌కల్, హద్నూర్‌ల్లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

◆ పీఎంఈజీపీ లబ్ధిదారులతో ముఖాముఖి

జిన్నారం (పటాన్‌చెరు): కేంద్ర సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల మంత్రి జీతంరామ్ మాన్జీ పీఎంఈజీపీ లబ్ధిదారులతో ముఖాముఖి సమావేశం మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. కేంద్ర పథకాల అమలు, ప్రయోజనాలపై మంత్రి లబ్ధిదారులతో ప్రత్యక్షంగా చర్చించారు. మైత్రిఫౌండేషన్ చైర్మన్, బీజేపీ నాయకులు చెన్నంశెట్టి ఉదయ్ కుమార్ మంత్రిని ఘనంగా సన్మానించారు.

◆ డీఎస్పీకి సత్కారం

జహీరాబాద్: జహీరాబాద్ డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్న సైదాను బంజారా సంఘం నాయకులు సత్కరించారు. మంగళవారం డీఎస్పీని ఆయన కార్యాలయంలో కలిసిన బంజారా సంఘం నాయకులు శ్రీనివాస్ నాయక్, రాంసింగ్, మోతిరాం సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

◆ ఎస్‌ఐగా సుధాకర్‌చారికి పదోన్నతి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌చారి ఎస్‌గా పదోన్నతి పొందారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆయనకు స్టార్ గుర్తును తొడిగి అభినందించారు. పదోన్నతి పొందడంపై సీఐ నయూముద్దిన్, ఎస్ నాగలక్ష్మి, మండల ప్రముఖులు సుధాకర్‌కు అభినందనలు తెలిపారు.

◆ మెట్రోకేం పరిశ్రమతో ఇక్కట్లు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధి బొంతపల్లిలోని పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు గిద్దె రాజు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన ఫిర్యాదు చేశారు. పరిశ్రమ నుంచి విచ్చలవిడిగా రసాయన వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడుదల చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

జహీరాబాద్: ఇందిరమ్మ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లను జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా పరిశీలించారు. మంగళవారం మొగుడంపల్లి మండలంలోని జాంగార్‌బౌలి తండాను సందర్శించారు. తండాలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం స్థితిగతులను పరిశీలించారు.

◆ మాజీ సర్పంచ్‌ల అరెస్టు

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్‌లో మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పెండింగ్ బిల్లుల కోసం హైదరాబాద్ వెళ్లకుండా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచ్‌లు కిష్టారెడ్డి, శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

◆ నేడు నవగ్రహాల ప్రతిష్ఠాపన

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని రామలింగేశ్వర ఆలయం ఆవరణలో బుధవారం నవగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహరాజ్ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం నవ గ్రహాల విగ్రహాల ప్రతిష్ఠాపన, అన్నదానం ఉంటుందన్నారు.

◆ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మునిపల్లి(అందోల్): హోలిస్టిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మండలంలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. కంటి చికిత్స, జ్వరం, దగ్గు, సాధారణ వ్యాధులకు సంబంధించి రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి వైద్యులు వర్షిణి, లక్ష్మీనారాయణ, జయరాజ్, కీర్తన, ఐశ్వర్య పాల్గొన్నారు.